# మీత్యాగం వెలకట్టలేనిది

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 20: మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులకు భూములిచ్చిన గ్రామాల ప్రజలందరికీ చేతులెత్తి మొక్కుతున్నా, మీత్యాగం వెలకట్టలేనిదని సీఎం కేసీఆర్ అన్నారు. అంతాయిపల్లి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బూత్‌లెవల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వేములఘట్‌తో పాటు ఇతర గ్రామాలకు చెందిన ఆర్అండ్ఆర్ కాలనీ ప్రజలు తమ సమస్యలను ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ద్వారా సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. ఈ మేరకు తన ప్రసంగంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులకు భూములిచ్చిన గ్రామాల ప్రజల త్యాగం వెలకట్టలేనిదని, వారందరికీ చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. వారికి ఎంతచేసినా తక్కువేనని, మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించి భవిష్యత్‌లో ఆర్అండ్ఆర్ కాలనీని అద్భుతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.


కాలనీ ప్రజా సమస్యల గురించి సీఎం కేసీఆర్‌కు వివరిస్తున్నఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

## డబ్బు, మద్యం అక్రమ రవాణాపై

# ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించేలా చర్యలు చేపట్టాలి
- ఎన్నికల నిర్వహణ టీం సభ్యుల శిక్షణా శిబిరంలో ఆర్డీవో బెన్ షాలోమ్

హుస్నాబాద్, అక్టోబర్ 20: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం అక్రమ రవాణా అధికంగా జరిగే అవకాశం ఉన్నదని, సంబంధిత ఎన్నికల నిర్వహణ అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని హుస్నాబాద్ ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బెన్ షాలోమ్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ టీం సభ్యులకు ఎన్నికల నియమావళిపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎలాంటి అవరోధాలు లేకుండా సజావుగా సాగేలా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు నాలుగు టీంలను ఏర్పాటు చేశామని, ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి డబ్బు, మద్యం రవాణా జరుగుతున్నట్లు తేలితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి ఓటు వేసేలా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ప్రభుత్వమే వాహన సౌకర్యం కల్పిస్తున్నదని, ఏ పార్టీకి సంబంధించిన వాహనంలో కూడా ఓటర్లు వెళ్లరాదని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో పటిష్ట బందోబస్తు, ప్రత్యేక నిఘా ఉంటుందని, సంబంధిత అధికారులు ఎల్లవేళలా విధుల్లో ఉంటారని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీఏవో అహ్మద్‌ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, ఎన్నికల టీం సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బెన్ షాలోమ్

# అభివృద్ధికే పట్టం కట్టాలి

**బీఆర్ఎస్ తొగుట మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తొగుట, అక్టోబర్ 20 : అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని వర్ధరాజ్‌పల్లిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, సర్పంచ్ చక్రి రాజవ్వతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్ప ఎన్నికల్లో మాయ మాటలు చెప్పిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు పైసా పనిచేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొమల కొమురయ్య, రైతు బంధు అధ్యక్షుడు కనకయ్య, సర్పంచ్‌లు ఎల్లం, మల్లయ్య, సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

## కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని పూజలు

కొమురవెల్లి, అక్టోబర్ 20 : కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలువాలని మండలంలోని మర్రిముచ్చాలలో శుక్రవారం ఎంపీపీ తలారి కీర్తనాకిషన్ దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ తలారి కీర్తనాకిషన్

## ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

మద్దూరు(ధూళిమిట్ట),అక్టోబర్ 20 : ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం ముదిరాజ్ మహాసభ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుల పెద్ద మనిషిగా పోతిరెడ్డి శ్రీనివాస్, మత్స్యశాఖ అధ్యక్షుడు గొడుగు జంపన్న, ప్రధాన కార్యదర్శిగా తుపాకుల యాదగిరి, ఉపాధ్యక్షులు పోతిరెడ్డి, రమేశ్, డైరెక్టర్లుగా పోతిరెడ్డి ఇస్తారి, సంపత్, పోతిరెడ్డి యాదగిరి, గొడుగు చంద్రయ్య, పాలేటి కనకయ్య, చొప్పరి సంపత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ మహాసభ గ్రామ కమిటీ సభ్యులను ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి సాగర్ సన్మానించారు.

## కోమటిబండను సందర్శించిన బీహారు బృందం


కోమటిబండను సందర్శించిన బీహారు అధికారుల బృందం

గజ్వేల్, అక్టోబర్ 20: మండలం పరిధిలోని కోమటిబండను బీహారు రాష్ట్రానికి చెందిన అధికారుల బృంద సభ్యులు శుక్రవారం సందర్శించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నరెడ్డి మనవ వనరుల కేంద్రంలో శిక్షణలో ఉన్న 156 మంది అడిటర్స్ అధికారుల బృందం మిషన్ భగీరథ ప్లాంట్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. సంస్థ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ ఆదేశాలతో కోర్సు డైరెక్టర్ జయశ్రీ సూచనలతో కోర్సు కోఆర్డినేటర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ప్లాంట్‌ను సందర్శించారు. అధికారుల ద్వారా మిషన్ భగీరథ పథకం రూపకల్పన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈ నాగార్జున, ఏఈలు వీణ, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


మద్దూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి**

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 20 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర అందనున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించి మోసపోకూడదన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డీసీఎస్ తనుజ, డీఆర్‌డీఏ ఏపీడీ జయదేవ్, డీఎంవో హర్ష, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, డీపీఎంలు కరుణాకర్, విద్యాసాగర్, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీఎం బాబురావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీసీలు ప్రేమలత, సిద్ధిమల్లయ్య, మహేందర్, కాంత్రి వీవో సభ్యులు గొట్టె కనకలక్ష్మి, బంటు లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో..**

బెజ్జంకి, అక్టోబర్ 20 : మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో చేపట్టే ధ్యానం కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లాప్రాజెక్ట్ మేనేజర్ మార్కెటింగ్ డీపీఎం కరుణాకర్ కోరారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కమిటీ సభ్యులు, ట్యాబ్ ఆపరేటర్లకు శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్యామ్ అవగాహన కల్పించారు.

## వరప్రసాద్ గౌడ్‌కు 'సర్వాయి పాపన్న' అవార్డు

హుస్నాబాద్, అక్టోబర్ 20 : గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న హుస్నాబాద్ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పూదరి వరప్రసాద్‌గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఆలిండియా బహుజన రైటర్స్ కాన్ఫరెన్స్‌లో వరప్రసాద్‌కు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యన్ చేతుల మీదుగా అవార్డును తీసుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన డెలిగేట్స్ సమక్షంలో జాతీయ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని, ఇందుకు సహకరించిన బహుజన సాహిత్య అకాడమీ వారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## 13వ వార్డులో ఇన్‌చార్జిల నియామకం


13వ వార్డులో వంద ఓట్ల ఇన్‌చార్జిల నియామకం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

దుబ్బాక టౌన్, అక్టోబర్ 20 : దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేస్తున్నాయి. శుక్రవారం 13వ వార్డులో బూత్ అధ్యక్షుడు తునికి సురేశ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇన్‌చార్జి గుండు భూపేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, కౌన్సిలర్ ఆస సులోచనస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేశ్, నాయకులు రొట్టె రాజమౌళి, బండి రాజు తదితరులు పాల్గొని, వంద ఓట్ల ఇన్‌చార్జిల నియామకాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు సమష్టిగా, ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో మంత్రి హరీశ్‌రావు సహకారంతో కొత్త ప్రభాకర్‌రెడ్డి కార్యదీక్షతతో మున్సిపాలిటీని అభివృద్ధిపరుస్తామన్నారు. మున్సిపాలిటీలోని 20 వార్డులో ఇన్‌చార్జిల నియామకం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంగారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.